ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష

నరసాపురం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు సూచించారు. శనివారం ముదునూరి తన కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణపై రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్స్ జారీ విషయంలో ఎలాంటి అలసత్వం లేకుండా వ్యవహరించాలని చెప్పారు. ప్రజలు సంతృప్తి చెందే విధంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఉపయోగపడే 11 రకాల సర్వీసులను ఉచితంగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో స్మశానవాటికలకు సంబంధించి స్థల సేకరణను వేగవంతం చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో ఎలాంటి వివాదాలు లేకుండా శ్మశానవాటికలు ఏర్పాటు కావాలన్నారు. స్థల సేకరణకు సంబంధించి అవసరమైన నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు చేస్తామని చెప్పారు. కొత్తగా ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి 90 రోజుల కాలవ్యవధిలో పట్టాలు అందించాలని చెప్పారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఎండీ ఫాజిల్, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.


నరసాపురంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు


మొగల్తూరులో మాట్లాడుతున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు

అధికారులకు నోటీసులు జారీ చేయాలి

మొగల్తూరు: మండల పరిషత్ సమావేశానికి రాని అధికారులకు నోటీసులు జారీ చేయాలని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ఆదేశించారు. శనివారం మొగల్తూరులోని లక్ష్మీ వెంకటేశ్వర కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీపీ అందే సూర్యావతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశాలకు అధికారులు హాజరుకాకపోవడంతో ప్రభుత్వం తరపున ఏకార్యక్రమాలు చేపట్టామో ప్రజలకు తెలిసే అవకాశం లేదన్నారు. మండలంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ అధ్యక్షులు 44 మంది ఉండగా కేవలం 16 మంది మాత్రమే హాజరుకావడం దారుణమన్నారు. నాయకులకే చిత్తశుద్ధి లేకపోతే అధికారులు కూడా అలాగే వ్యవహరిస్తారన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ జి.సువర్ణరాజు మాట్లాడుతూ నాడు-నేడు ఫేజ్ 2లో మండలంలో 46 పాఠశాలలు, 10 అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ విద్యా సంవత్సరం ఆరంభంలోనే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లును పంపిణీ చేశామన్నారు. వ్యవసాయాధికారి అబ్దుల్ రహ్మాన్ మాట్లాడుతూ మండలంలో సుమారు 1200 ఎకరాల్లో సార్వా సాగు చేపడతారని అంచనా వేశామని, ఇప్పటి వరకు సుమారు 100 ఎకరాల్లో ఆకుమడులు వేశారని వివరించారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ ప్రసాదరాజు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికీ స్వచ్ఛమైన తాగు నీరందించేందుకు మండలంలో సుమారు రూ.20 కోట్లు కాగా ఇప్పటి వరకూ రూ.8.40 కోట్ల పనులు పూర్తి చేశారన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజి, వైస్ ఎంపీపీలు కైలా సుబ్బారావు, కవురు సీతామహలక్ష్మి, ఎంపీడీఓ వి.బాబ్జి రాజు, నాయకులు అందే భుజంగరావు, కర్రి ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కంటి వైద్య శిబిరం తనిఖీ


పాలమూరులో కంటి వెలుగు పరీక్షా శిబిరాన్ని తనిఖీ చేస్తున్న ఉమా మహేశ్వరరావు

పెనుమంట్ర: మండలంలోని పాలమూరు శెట్టిబలిజ రామాలయం వద్ద నిర్వహించిన వైఎస్సార్ కంటి వెలుగు పరీక్షలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఉమా మహేశ్వరరావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాలమూరులో ఫ్యామిలీ కాన్సెప్ట్ శిబిరాన్ని 60 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు మూడు రోజుల పాటు 150 మందికి పెనుమంట్ర పీహెచ్‌సీ పరిధిలో నేత్ర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిలో 30 మంది భీమవరం, పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి ఆపరేషన్లు, అవసరమైన వారికి కంటి అద్దాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

కంటి ఆరోగ్యంపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న లక్ష్మీపతిరాజు, ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి

పాలకొల్లు సెంట్రల్: కంటి లోపల ఏర్పడే క్యాన్సర్ కణాలు దృష్టి లోపానికి కారణమవుతాయని లయన్స్ క్లబ్ మేనేజర్ లక్ష్మీపతిరాజు అన్నారు. శనివారం స్థానిక అద్దేపల్లి సత్యానారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ విభాగం ఆధ్వర్యంలో కంటి క్యాటరాక్ట్ పరీక్షపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీపతిరాజు మాట్లాడుతూ క్యాన్సర్ కణాలు కంటి ముందు భాగంలో ఉండే క్యాటరాక్ట్‌ను పూర్తిగా హరిస్తాయని దాని ద్వారా దృష్టి లోపం ఏర్పడుతుందని అన్నారు. అందువల్ల ప్రతీ విద్యార్థి తగిన ఆహార నియమాలు పాటిస్తూ కంటిని జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ చక్కటి ఆహారాన్ని తీసుకోవడం వల్ల కంటి క్యాటరాక్ట్ లోపాన్ని నివారించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ పోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి.సుబ్బలక్ష్మి, డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో మలేరియా దూరం


మేడపాడులో మలేరియా మాసోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

యలమంచిలి: ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల పరిశుభ్రంగా ఉంచడం ద్వారా మలేరియా మహమ్మరిని తరిమికొడదామని మేడపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ కొవ్వూరి ప్రభాకరరెడ్డి చెప్పారు. మలేరియా మాసోత్సవాలు సందర్భంగా శనివారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచనిచో దోమలు పెరిగి మలేరియా వ్యాధిని ప్రబలిస్తాయన్నారు. కనుక ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలతోపాటు గ్రామాన్ని కూడా శుభ్రంగా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో నరసాపురం సబ్ యూనిట్ ఆఫీసర్ రాజకుమార్, డీపీఎంఓ సుదీర్, ఎంపీఈఓ పాము ప్రభాకరరావు, పీహెచ్ఎన్ గంటా రత్నకుమారి పాల్గొన్నారు.

ఫిల్టర్ బెడ్స్‌లో ఇసుక మార్పిడి

ఆకివీడు: మంచినీటి సరఫరాను మెరుగుపరచేందుకు స్థానిక శాంతినగర్‌లోని ఓహెచ్ఎస్ఆర్ వద్ద ఉన్న రెండు ఫిల్టర్‌బెడ్‌లను గత రెండు రోజులుగా శుభ్రపరుస్తున్నారు. రూ.4,88,659 వ్యయంతో ఫిల్టర్ బెడ్‌లలో కొత్త ఇసుక నింపుతున్నట్లు నగర పంచాయతీ వాటర్ వర్క్స్ ఏఈ రాజు శనివారం చెప్పారు. మరో రెండు రోజుల వరకూ పని ఉంటుందన్నారు. ప్రజలకు మంచి నీటి ఇబ్బంది లేకుండా అరగంట సేపు మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఫిల్టర్ బెడ్‌లలో పాత ఇసుకను పూర్తిగా బయటకు తీయించివేస్తున్నామన్నారు. ఇటుక, కంకర్లను నీళ్లతో కడిగి, శుభ్రపరుస్తున్నామన్నారు. ఫిల్టర్ బెడ్‌ల చుట్టూ పేరుకున్న నాచును కడిగిస్తున్నామని తెలిపారు. అనంతరం ఫిల్టర్ బెడ్‌లలో గరుక ఇసుక వేయిస్తామన్నారు. రెండు రోజుల్లో పనులు పూర్తి అయిన తరువాత ప్రజలకు రక్షిత నీరు సరఫరా అవుతుందన్నారు.

ఇమ్యునైజేషన్ కార్యక్రమం పరిశీలన

వీరవాసరం: స్థానిక పీహెచ్‌సీలోని సచివాలయం -3లో నిర్వహిస్తోన్న ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.ఉమా మహేశ్వరరావు శనివారం సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించి, వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్నీ సందర్శించి, గర్భిణులు, బాలింతలకు, కిషోర బాలికలకు ఇచ్చే పౌష్టికాహారంపై ఆరా తీశారు. ఆయన వెంట వీరవాసరం మెడికల్ ఆఫీసర్ సత్యనారాయణ రాజు, హెల్త్ అసిస్టెంట్ వై.మోహన్‌రావు పాల్గొన్నారు.

వేములదీవి వెంకన్నకు ప్రత్యేక పూజలు

నరసాపురం రూరల్: మండలంలోని మేములదీవి గ్రామంలోని కాపుల కొడపలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.


ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వరస్వామి

అనంతరం ఆలయ ఆవరణలో నిర్వహించిన అన్న సమారాధనలో సుమారు వెయ్యి మంది స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జగనన్న సురక్షతో పేదలకు మేలు

పెనుగొండ: అర్హులైన ప్రతీ ఒక్కరికీ లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష పథకం అమలు చేస్తుందని తహసీల్దారు ఎస్ గురుమూర్తి రెడ్డి అన్నారు. శనివారం పెనుగొండ పంచాయతీ కార్యాలయంలో వలంటీర్లు, సచివాలయాల సిబ్బందికి జగనన్న సురక్ష అమలుపై అవగాహన కల్పించారు. సచివాలయాల్లో ప్రజలకు 11 రకాల సేవలకు సంబంధించి ధ్రువపత్రాలు ఉచితంగా అందిస్తామని విషయాన్ని ప్రజలకు ప్రచారం చేయాలన్నారు. అదేవిధంగా ప్రతీ ఇంటికీ వెళ్లి జగనన్న సురక్షపై అవగాహన కల్పించాలన్నారు. జూలై 1 నుంచి సచివాలయాల వారీగా ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎస్ఎస్వీ నరసింహమూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: అర్హులందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రధాన లక్ష్యమని మేడపాడు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు, స్థానిక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గుర్రాల వెంకట్రావు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం మేడపాడులో స్థానిక నాయకులు, సచివాలయ ఉద్యోగులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ, ఉప సర్పంచ్ ముద్దల శ్రీనివాస్, గృహసారథులు కుక్కల సూరయ్య, కుక్కల ఆంజనేయులు సచివాలయ ఉద్యోగులు ఉమర్ ఆలీషా, కె.నాగలక్ష్మి పాల్గొన్నారు.


పెనుగొండలో జగనన్న సురక్షపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ గురుమూర్తి రెడ్డి


మేడపాడులో జగనన్న సురక్ష సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు

పెనుగొండ: రైతులకు నాసిరకం విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి పి.స్పందన తెలిపారు. శనివారం పెనుగొండ ఎంపీడీఓ కార్యాలయంలో ఎరువులు, పురుగు మందుల డీలర్ల సమావేశంలో మాట్లాడుతూ రైతులకు అందించే ఎరువులు, పురుగు మందులను ఎంఆర్‌పీ ధరకే విక్రయించాలన్నారు. రైతులకు తప్పని సరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. దుకాణాల్లో ధరలు, స్టాక్ బోర్డును రైతులకు తెలియ చేసే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులువ విక్రయించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే దుకాణాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

జొన్నలగరువులో ఫ్యామిలీ ఫిజీషియన్


సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

పాలకొల్లు అర్బన్: మండలంలోని శివదేవునిచిక్కాల పంచాయతీ పరిధిలోని జొన్నలగరువులో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముందుగా సీజనల్ వ్యాధుల తపై గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కలిగించారు. లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ రోగులను పరీక్షించి మందులు అందజేశారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న రోగుల ఇంటికి వెళ్లి పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సలహాలు అందజేశారు. గర్భిణులు, సుగర్, బీపీ, బాలింతలు, ఇతర వ్యాధులతో బాధపడుతున్న 152 మందిని పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దిడ్ల మణివజ్రం, ఎంపీటీసీ సభ్యురాలు స్వర్ణ, ఆరోగ్య విస్తరణాధికారి కె.ప్రభాకర్, ఎంఎల్‌హెచ్‌పీ పి.సుజిత, ఏఎన్ఎం కె.సుశీల తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన


కాళ్ల హైస్కూల్లో విద్యార్థులతో కలిచి భోజనం చేస్తున్న జిల్లా కో ఆర్డినేటర్ కృష్ణారావు

కాళ్ల: రాష్ట్ర ప్రభుత్వం విద్య, నాడు-నేడు తో పాటు జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకానికి అత్యంత ప్రాముఖ్యతనిస్తుందని, విద్యార్థుఏలందరూ మధ్యాహ్న భోజనం చేసేలా చూడాలని ఎండీఎం/ఎస్ఎస్ జిల్లా కో ఆర్డినేటర్ కృష్ణారావు అన్నారు. మధ్యాహ్న భోజనం, పాఠశాల పారిశుద్ధ్యం నిర్వహణ పరిశీలన నిమిత్తం కాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక ప్రాఠశాల (మెయిన్)ను ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించారు. రాగి జావ, ఆకు కూర, అన్నం, తీపి పొంగలి, పప్పు చారు రుచి చూచి పిల్లలకు వడ్డించి వారితో కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న గోరుముద్దలో ఉన్న మెనూ పదార్థాల పోషక విలువలు తెలియజేసి పాఠశాలకు హాజరైన విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం చేసేలా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులను కోరారు. రికార్డులను, టాయ్‌లెట్ల నిర్వహణ పరిశీలించి ఆయాలకు తగు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జె.లక్ష్మినారాయణ శాస్త్రి, ఎం.వి.సుందరమణి పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలి

మొగల్తూరు: ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీలో ఎటువంటి అవకతవకలకు పాల్పడవద్దని మండల పరిషత్ ప్రత్యేకాధికారి వి.విజయలక్ష్మి సూచించారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ల సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం గ్రామంలోని సత్రవుపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. అదే ప్రాంతంలో నాడు-నేడులో చేపట్టిన పాఠశాల అభివృద్ధి పనులను పరిశీలించి, కొత్తకాయలతిప్పలో జగనన్న లేఅవుట్‌ను పరిశీలించి లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాకపోవడాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా పనులను త్వరతగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ వాండ్రు బాబ్జి రాజు, సీడీపీవో ఊర్మిల, హౌసింగ్ ఏఈ ఫణీంద్ర,ఏపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సత్రవుపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి విజయలక్ష్మి

దూర ప్రాంత ప్రయాణికులకు చార్జీలో 10శాతం రాయితీ

నరసాపురం: ఆర్టీసీ బస్సుల్లో హైదరాబాద్, విశాఖపట్టణం వంటి దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు చార్జీలో 10 శాతం రాయితీ ఇస్తున్నట్టు నరసాపురం డిపో మేనేసజర్ ఎస్.సుబ్బన్న రెడ్డి చెప్పారు. ముందుగా రాను, పోను ప్రయాణానికి రిజర్వేషన్ చేయించుకుంటే చార్జిజలో రాను 10 శాతం, పోను 10 శాతం రాయితీ కల్పిస్తున్నామని చెప్పారు. గతంలో తిరుగు ప్రయాణంలో మాత్రమే రాయితీ ఉండేదని వివరించారు. అలాగే జూలై 3న గురుపౌర్ణమి సందర్భంగా అరుణాచలం వెళ్లే భక్తులకు నరసాపురం డిపో నుంచి ప్రత్యేక సర్వీస్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సర్వీస్ ద్వారా శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, అరుణాచలం, గిరిప్రదక్షణ చేసి రావచ్చని చెప్పారు. ఇక ప్రతీ శనివారం రాత్రి 7 గంటలకు నరసాపురం నుంచి బయలుదేరి ఆదివారం విశాఖపట్టణం తీసుకెళ్లి అక్కడ కైలాసగిరి, సింహాచలం , ఆర్కే బీచ్, జూపార్క్ చూపించి తీసుకువస్తామని చెప్పారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పోటీతత్వంతో ముందుకు సాగాలి

పాలకొల్లు అర్బన్: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరచుకుని జీవితంలో మంచి స్థానానికి చేరుకోవాలని శ్రీ విశ్వ విజ్ఞాన, విద్య, ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం శ్రీ విశ్వ విజ్ఞాన విద్య, ఆధ్మాతిక పీఠం, ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ప్రోత్సాహంతో పేద, మెరిట్ విద్యార్థులకు నగదు పారితోషికాలు అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఆధ్యాత్మిక భావాన్ని అలవరచుకోవడంతో పాటు ప్రకృతి సమతుల్యతను కాపాడాలన్నారు. దీనికి ప్రతీ విద్యార్థి ఏడాదికి మూడు మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలని కోరారు. పాఠశాల పూర్వ విద్యార్థి, రిటైర్డు ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎంఆర్‌కే రాజు- సుశీల దంపతుల విరాళంతో 6వ తరగతి నుంచి పదో తరగతి మెరిట్ విద్యార్థులకు రూ.10,750, అలాగే పేద మెరిట్ విద్యార్థులు ముగ్గురికి ఒకొక్కక్కరికి రూ.10 వేలు చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రాజు దంపతులను ఉమర్ ఆలీషా సాలువాతో సత్కరించి ఆశీర్వచనాలు అందజేశారు. పాఠశాల హెచ్ఎం జీబీజే ప్రసాద్, గొట్టుముక్కల సత్యవతి, ఉమర్ ఆలీషా ట్రస్ట్ జిల్లా కన్వీనర్ అడబాల వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.


లంకలకోడేరులో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న దృశ్యం

విద్యార్థి మిస్సింగ్ కథ సుఖాంతం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో 29వ వార్డు చింతల తోటకు చెందిన మజ్జి రామ్‌తేజ్ మిస్సింగ్ కేసు సుఖాంతమైంది. శుక్రవారం పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు చూసుకుని వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన రామ్‌తేజ్ రాత్రి వరకూ తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఎంతో ఆందోళనకు గురయ్యారు. ఈ సమాచారాన్ని పత్రికలు, సోషల్ మీడియా, బంధువులకు చేరవేయడంతో అందరూ ఎంతో శ్రమించి విద్యార్థి రామ్‌తేజ్ కోసం గాలించగా శనివారం రాత్రి 10.30 గంటల సమయంలో పట్టణంలో రైల్వేస్టేషన్ వద్ద ఉన్నట్లు గుర్తించారు. వెంటనే తల్లిదండ్రులు, బంధువులు వెళ్లి తేజను ఇంటికి తీసుకువచ్చారు. శనివారం విద్యార్థి తండ్రి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ పిల్లాడిని వెతకడానికి సహకరించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

గరగాలమ్మ డ్రెయిన్‌కు మోక్షం


సిద్ధాంతంలో గరగాలమ్మ డ్రెయిన్ ప్రక్షాళనకు నిర్మాణాలు


రిటైనింగ్ వాల్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు (ఫైల్)

- గడపగడపకులో సమస్యకు పరిష్కారం
- హామీని నిలుపుకున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: సిద్ధాంతంలో దశాబ్ద కాలానికి పైగా సమస్యగా మారిన గరగాలమ్మ డ్రెయిన్ ప్రక్షాళనతో మురుగు ముంపునకు మోక్షం కలిగింది. సిద్ధాంతంలో గరగాలమ్మ డ్రెయిన్‌తో గరగాలమ్మ దిబ్బ, చెరువు పేట, లంకపేట, అరుంధతీ పేట, శాలి పేటలు ప్రతీ ఏటా వర్షాకాలంలో చినుకు పడితే చాలు మురుగు అంతా రోడ్డుపై కి చేరి తీవ్ర సమస్యగా ఉండేది. కొన్నేళ్లుగా ఆయా ప్రాంతాల ప్రజలు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఈ తరుణంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో సిద్ధాంతంలో నిర్వహించిన సమయంలో ఆయా ప్రాంతాల ప్రజలు ప్రధాన సమస్యగా మారిన గరగాలమ్మ డ్రెయిన్ ముంపును ప్రస్తావించి పరిష్కరించాలంటూ విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సత్వరం సమస్యను పరిష్కరించాలంటూ ఆదేశించారు. దీంతో అధికారలు హుటాహుటిన డ్రెయిన్ సర్వే నిర్వహించి, ఆక్రమణలు తొలగించడంతో పాటు డ్రెయిన్ వెడల్పు, రిటైనింగ్ వాల్‌ల నిర్మాణం నిత్య పర్యవేక్షణతో పూర్తి చేశారు. అలాగే సిద్ధాంతం మురుగు అంతా ఇలపర్రు ఛానల్‌లోకి వస్తుండడంతో రైతులు ఇబ్బందులు, ఇటు గ్రామస్థుల ఇబ్బందులు ఒకేసారి తొలగించడానికి ప్రణాళిక రూపొందించి అమలు చేశారు. దీంతో ఇటు రైతులు, అటు గ్రామస్థులు ఊపిరి పీల్చుకొంటున్నారు. రిటైలింగ్ వాల్ నిర్మాణం పూర్తి కావడంతో రైతులకు అడ్డంకి లేకుండా ఇలపర్రు చానల్‌కు నీటిని విడుదల చేశబూరు. గరగాలమ్మ డ్రెయిన్ ప్రక్షాళన దిగువలో పూర్తి కావడంతో ఎగువలోనూ మురుగు నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలంటూ మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు ఆదేశించడంతో పూర్తి స్థాయిలో సమస్య పరిష్కరం కానుందంటూ గ్రామస్థులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ప్రధాన సమస్యకు పరిష్కారం



సిద్ధాంతంలో ప్రధాన సమస్యకు పరిష్కారమైంది. ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దేవుడి పొలాలు ప్రతీ ఏటా ముంపుకు గురవుతున్నాయి. దీంతో పాటు నాలుగైదు కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– చిన్నం ఏడుకొండలు, ఎంపీటీసీ

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

అత్తిలి: బాల్య వివాహాలు అరికట్టాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని మంచిలి సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి మహాలక్ష్మి అన్నారు. అత్తిలి మండలం ఆరవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బాల్య వివాహాలు వలన కలిగే అనర్థాలపై శనివారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం వల్ల అనేక దుష్పరిమాణాలు సంభవిస్తాయన్నారు. బాలికలు ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా స్వతంత్రంగా జీవించగల్గుతారన్నారు. 18 ఏళ్లు నిండకుండా వివాహం చేయడం వారి హక్కులను ఉల్లంఘించడమేనన్నారు. బాల్యవివాహాలు చేసుకున్నట్లుయితే వారికి జైలు శిక్షతో పాటు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి అనంతలక్ష్మి, మహిళా సంరక్షణ అధికారిణి లక్ష్మీకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉండ్రాజవరపు రాణి, విఎల్ఎన్ కుమారి, సంది విజయ, టి వరలక్ష్మి, బాలికలు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ జాతర

భీమవరం అర్బన్: భీమవరం మండలం దొంగపిండి ముత్యాలమ్మవారి జాతరను శనివారం వైభవంగా నిర్వహించారు. బాణసంచా కాల్పులు, డప్పు వాయిద్యాలు, బుట్టబొమ్మల కళాకారులతో, నృత్యాల నడుమ ముత్యాలమ్మవారి గరగలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆశీర్వాదాలు అందుకున్నారు. వైస్ ఎంపీపీ తిరుమాని గంగా భవాని, సర్పంచ్ బొడ్డు రేవతి అమ్మవారిని దర్శించుకుఆన్నరు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తిరుమాని ధనంజయరాజు, రేవు రాంబాబు, బొడ్డు మోహన్, రేవు పూర్ణచంద్రరావు, రేవు జనార్దన్‌లు పర్యవేక్షించారు.